

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

31 అక్టోబర్ 2025 పేజీలు : 08


## మాకు ఎంతో ఆప్తులు మాలేపాటి సుబ్బానాయుడు

- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ
- పార్టీ అధికారంలో లేనిరోజుల్లోనే పార్టీని ఇక్కడ నిలబెట్టారు
- తమవంతు మద్దతు మాలేపాటి కుటుంబానికి ఎప్పుడూ ఉంటుంది

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఇటీవల ఆకస్మిక మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్‌ల చిత్ర పటాలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు నివాళులర్పించారు. గురువారం మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ దశదిన కర్మలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు..

-మిగతా 2లో





## మంచి లీడర్లను కోల్పోయాం

### మాలేపాటి ఉత్తరక్రియలలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

**కావలి, మేజర్‌న్యూస్ :**

కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ కావలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి, రాష్ట్ర ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పార్టీ భానుచందర్ ఇటీవల మృతి చెందడం, నెల్లూరు జిల్లాలోని కాక రాష్ట్రంలో కూడా సంచలనంగా మారింది. అయితే గురువారం వారి ఉత్తరక్రియలకు అతిరథ మహారాజులైన మంత్రులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఇన్చార్జి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు భారీగా హాజరయ్యారు. మొదటిగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అతిరథ, మహారధులు మాట్లాడుతూ, మాలేపాటి సుబ్బానాయుడు మృతి రాష్ట్ర తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని, తెలుగుదేశం కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా నిలబడి నేనున్నాను అని భరోసా కల్పిస్తూ, వైసిపి ప్రభుత్వం ఎన్ని అరాచక కార్యక్రమాలు చేసినప్పటికీ తను వారికి ఎదురు నిలబడి పోరాడారు. అధికారంలో ఉన్న వైసిపి ఎన్నో కేసులు పెట్టడం జరిగినది. అటువంటి మహా గొప్ప నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని వారు తెలిపారు. అలాగే దగదర్తి మండల యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ కూడా అకాలం మరణం మాలో కలచి వేసిందని, సౌమ్యుడు ఎప్పుడు కార్యకర్తలకు ఆ మండలంలో అండగా ఉంటూ, ఎంతో మందికి సహాయ, సహకారాలు

-మిగతా 2లో

### తుఫాన్ బాధితులకు నిత్యవసర

## సరుకులు పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు 53వ డివిజన్ వెంకటేశ్వరపురం గాంధీ గిరిజన కాలనీలో డివిజన్ ఇన్‌చార్జ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ పరంధామయ్య, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న గిరిజన కుటుంబాలకు నిత్యవసర వస్తువులు, ముంపు ప్రాంత నిర్వాసితులైన 200 మందికి.. భోజనాలను వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చంద్రశేఖర్ రెడ్డి తెలియజేశారు. అనంతరం స్థానిక మహిళలు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిసి..
తమ ప్రాంత ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

-మిగతా 2లో

## తుఫాన్ భాధితులకు రేషన్ పంపిణీ

### బాధితులు ఆందోళన చెందవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ఇటీవలి మొంథా తుఫాన్ ప్రభావిత కుటుంబాల పునరావాసం సహాయక చర్యలకు జిల్లా పరిపాలన విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టింది. బాధితులు ఆందోళన చెందవద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గురువారం ఉదయం తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలు, వాటి పురోగతిపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, జిల్లా అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుఫాన్ అనంతరం తీసుకుంటున్న చర్యలను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో మొత్తం 3,635 కుటుంబాలు సురక్షితంగా వసతి పొందాయి. వీటికి అదనంగా 13,512 మత్స్యకార కుటుంబాలు, 106 చేనేత కుటుంబాలు తుఫాన్ ప్రభావితులుగా ఉన్నారు. చేనేత కుటుంబాలకు సంబంధించి పక్కాగా సర్వే చేయా లన్నారు. వీరందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర సరుకులను ఈ గురువారం నుండి సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఈ పంపిణీ కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను తప్పకుండా భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభావిత కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకుల పంపిణీ వివరాలిలా ఉన్నాయి. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి 25 కిలోల బియ్యంతోపాటు అదనంగా కిలో బంగాళా దుంపలు, కిలో పామాయిల్, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో చక్కెర పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులు, చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యం చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి సహాయం అందేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జేసి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయకుమార్ పాల్గొన్నారు.

### స్త్రీలకు మనోధైర్యమే

## ఆయుధం

- సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకం
- జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలి
- సహనం మహిళల పాలిట ఆభరణం
- ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఎవరో ఏదో అనుకుంటారని వెనుకడుగు వేసే స్వభావం వీడి మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని టౌన్ హాల్లో శ్రీ పరంజ్యోతి స్త్రీ శక్తి అనే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మహిళలను ఉద్దేశించి తమ అమూల్య సందేశాన్ని అందించారు. స్త్రీలు స్వతహాగా శక్తివంతులని తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీసి ప్రపంచానికి చాటాలని కోరారు. కాపురాన్ని చెక్కబెడుతూ పిల్లల భవిష్యత్తును తీర్చిది ద్దుతూ పెద్దల పట్ల

-మిగతా 2లో

### సిఎం చంద్రబాబు నాయుడు ప్రేరణతో

# అధికారులు, నాయకులు సమన్వయంతో పనిచేశారు

- రియల్ టైం గవర్నెన్స్‌లో భాగంగా క్షేత్ర స్థాయిలో అధికారులకు దిశా నిర్దేశం చేయడంలో మంత్రి లోకేష్ చొరవ అభినందనీయం
- అధికారులు, నాయకులు సమిష్టి కృషితో తుఫాను సహాయక చర్యలు చేపట్టారు
- వరద బాధితులకు అండగా నిలిచిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు అభినందనలు
- అధికారులు, నాయకులు కలిసి సమిష్టిగా పని చేస్తే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో ఆచరణలో చేసి చూపించారు
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** తుఫాను తీవ్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతర పర్యేక్షణ చేస్తూ అధికార యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడం వల్లే ఆస్థి, ప్రాణ నష్టాలను నివారించగలిగామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇందుకూరు పేట మండల కేంద్రంలో మొంథా తుఫాను కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార సోదరులకు ఆమె నిత్యావసర సరుకుల కిట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. మత్స్యకార సోదరులకు ప్రభుత్వం తక్షణ సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు 1 కిలో కందిపప్పు, 1 కేజీ పామాయిల్, కిలో ఉల్లగడ్డలు, కిలో ఎర్రగడ్డలు అందచేసిందనన్నారు. ముంపు ప్రాంత వాసులను పునరావాస కేంద్రాలకు తరలించి అధికారులతో కలిసి సహాయక చర్యలలో పాల్గొన్న టిడిపి, కూటమి పార్టీ నాయకులను ఆమె అభినందించారు. నిత్యం అందుబాటులో వుంటూ పరస్పర సమన్వయంతో పని చేసి ప్రజలకు ఏ ఇబ్బంది రాకుండా కంటికి రెప్పలా కాపాడిన రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖాధికారుల పనితీరును ఆమె ప్రశంసించారు. చంద్రబాబు ప్రేరణతో తుఫాను సహాయక బాధ్యతను తమ భూజాలకెత్తుకొని సహాయక శిబిరాలలో ఉంటున్న బాధితులకు భోజనం, చిన్న పిల్లలకు పాలు అందించచన నాయకులు, కార్యకర్తలు ముందు ముందు ఇదే స్ఫూర్తితో పని చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపికృష్ణ, ఎంపీడీఓ నాగేంద్ర బాబు, జెడ్‌పి వైస్ ఛైర్మెన్ శ్రీహరికోట విజయలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్‌కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోదూరు కమలాకర్ రెడ్డి, వెస్ట్‌పాళెం పెద్దకాపు ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఈస్ట్‌పాళెం పెద్దకాపు శ్రీహరి శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు పామంజి నరసింహ, ఊటుకూరు రాజ, ముక్కంటి చంద్ర, కటారి బాబు, అంగేరి మల్లయ్య, ముక్కంటి అంకయ్య, వైస్ ప్రెసిడెంట్ ఊటుకూరు ప్రసాద్, వియ్యాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


# చిరు వ్యాపారికి తోపుడు బండి అందచేసిన వేమిరెడ్డి దంపతులు




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మహిళకు తోపుడు బండి ఇచ్చి ఆమె జీవనోపాధికి చేయూత ఇచ్చారు వేమిరెడ్డి దంపతులు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని విపిఆర్ నివాసంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాళెం పట్టణ పరిధిలోని కాశీ పాళెం ప్రాంతానికి చెందిన కూరగాయల వ్యాపారం చేసుకునే రాణి అనే పేద మహిళకు తోపుడు బండి యిచ్చి ఆదుకున్నారు. వారు ఈ సందర్భంగా జీవనోపాధి కోసం కష్టపడుతున్న చిరు వ్యాపారులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేయూత ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు చేసిన ఈ సహాయం తాను ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చిరు వ్యాపారి రాణి అనే మహిళ వేమిరెడ్డి దంపతుల దాతృత్వాన్ని ప్రశంసించింది. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట టిడిపి మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, కెవి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# యూనిటీ మార్చ్‌లో పాల్గొని విజయవంతం చేయండి

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఉక్కు మనిషి, దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న నెల్లూరులో జరిగే యూనిటీ మార్చ్ పాదయాత్రలో యువత, వివిధ రంగాల నిపుణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం జాతీయ సమైక్యతా నిర్మాత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి అని తెలిపారు. ఆయన అసాధారణ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సర్దార్ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని చెప్పారు. ఏక్తా దివస్ సందర్భంగా అక్టోబర్ 31న ఉదయం సర్దార్ 150 యూనిటీ మార్చ్ అనే పేరుతో మై భారత్ నెల్లూరు, ఎన్ఎస్ఎస్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్‌సీ మైదానం నుంచి ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వేదాయపాలెం వరకు నిర్వహించే 5 కిలోమీటర్ల పాద యాత్రను జయప్రదం చేయాలన్నారు. దేశ సమైక్యతలో పౌరులను వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ వైపు నడిపిం చడంతో పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ ను గౌరవించడం ఈ పాదయాత్ర ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వం కాపాడుకోవడంతో పాటు ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులవ్వాలన్నారు.

## తుఫాన్ బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ

*(మొదటి పేజీ తరువాయి)*

చూపే దిశగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆ ప్రాంతాన్ని చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించి, ముంపు సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం లభించే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. పర్వతరెడ్డి మాట్లాడుతూ.. మొంథా కారణంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో గిరిజనుల ఇళ్లలోకి నీరు చేరి.. వారికి తాగేందుకు మంచినీరు కూడా కరువైందన్నారు. ఈ పరిస్థితుల్లో తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న సమయంలో బాదితులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. ఆహారం అందజేసిందన్నారు. గాంధీ గిరిజన కాలనీ బాధితును ఆదుకునే దిశగా.. డివిజన్ ఇంచార్జ్ వెంగల్ రెడ్డి ఆధ్వర్యంలో బాధిత ప్రజలకు బియ్యంతోపాటు 5 రకాల నిత్యవసర వస్తువులు కూడా అందజేశామన్నారు. రాజకీయాలకతీతంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ప్రజలు ఇబ్బంది పడుతున్న ముందుండి.. సేవలందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కూడా బాధితులకు అండగా నిలిచి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెర్నెటి కోటేశ్వర రెడ్డి, డివిజన్ నేతలు ప్రసన్న కుమార్, శరత్, 54 డివిజన్ వైసిపి నేతలు మస్తాన్, అస్లాం, సలాం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్త్రీలకు మనోధైర్యమే ఆయుధం



*(మొదటి పేజీ తరువాయి)*

గౌరవ మర్యాదలతో మహిళలు తమ ఔనత్యం చాటుకోవాలని కోరారు. సమాజానికి ఉత్తమ పౌరులు అందించడంలో స్త్రీల పాత్ర కీలకమన్నారు. జీవితంలో ఒడిదుడుకులను ఓర్పుతో ఎదుర్కోవాలని ఎటువంటి పరిస్థితులలో మనోధైర్యం కోల్పోకూడదని ఎమ్మెల్యే హితవు పలికారు. సహనం మహిళల పాలిట ఆభరణంమని మహిళలు ఆత్మాభిమానంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సౌజన్య భగవత్ దాసాజి భారతి, అనిత, రమణయ్య, కిషోర్, సుధాకర్ పాల్గొన్నారు.

## ఇద్దరు మంచి లీడర్లను కోల్పోయాం

*(మొదటి పేజీ తరువాయి)*

అందిస్తూ అలాగే పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకైతే ,నేమి వివాహాలు చేసుకునే వారి కైతేనేమి తను ఎన్నో గుప్త దానాలు అందించారు. అక్కడి ప్రజలు తను లేని లోటును ఇంక ఎవరు భర్తీ చేయగలరు అనే విధంగా కన్నీటి పర్వతం అవడం విశేషం. దగదర్తి మండలంలో వారి ఉత్తరక్రియలలో పాల్గొన్న ప్రజలను చూస్తే ఒక పండుగ వాతావరణాన్ని తలపించింది. తెలుగుదేశం పార్టీ మాలేపాటి కుటుంబానికి ఎప్పుడు అండగా తోడుగా ఉంటుందని తెలిపారు. అలాగే త్వరలోనే ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌బాబు కూడా దగదర్తికి వస్తున్నట్లు సమాచారం అనంతరం వారి కుటుంబ సభ్యులను వారు కలిసి ఎప్పుడు అండగా పార్టీ ఉంటుంది అని భరోసాని కల్పించారు. అనంతరం ఉత్తర క్రియలు కార్యక్రమాలను కొనసాగించారు.

## మాకు ఎంతో ఆప్తులు మాలేపాటి సుబ్బానాయుడు

*(మొదటి పేజీ తరువాయి)*



ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనేందుకు దగదర్తి రావడం విచారకరమన్నారు. పార్టీ అధికారంలో లేనిరోజుల్లోనే పార్టీని నిలబెట్టా రని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసిన ఇద్దరు మంచి నాయకులను కోల్పోవడం బాధాకరమన్నారు. మాలేపాటి సుబ్బా నాయుడు తమకు ఎంతో ఆప్తులని, వారి మృతి తీరని లోటన్నారు. దగ దర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. మాలేపాటి సుబ్బానాయుడు చివరి కార్యక్రమం మా కోవూరులో జరిగిందని గుర్తు చేశారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయడమే గాక మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారని, ఎంతో ఆప్యాయంగా ఉండే కుటుంబ సభ్యుడిని కోల్పోయామన్నారు. సుబ్బానాయుడు కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత చేనేత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా చేనేత ఐక్య కార్యాచరణ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో చేనేత జౌళి శాఖ సంచాలకులు రమేష్ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. చేనేత జౌళి శాఖ అధికారులతో కలిసి నారాయణరెడ్డిపేట గ్రామంలో గల ఈశ్వరమ్మ తోటలో మగ్గాలను పరిశీలించారు. తుఫాను రాష్ట్రాన్ని ముఖ్యంగా నెల్లూరు జిల్లాను అతలాకుతలం చేసింది. చేనేత వృత్తిదారులు జిల్లా మొత్తం మీద నాలుగు వేల కుటుంబాలు, ఉపవృత్తుల మీద 5వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. నెల్లూరు జిల్లా మొత్తం మగ్గాలు, పడుగులు తుఫాను కారణంగా చేనేతలందరూ అన్నిచోట్ల పనిని నష్టపోయారు. మగ్గం గుంటల్లోకి నీరు చేరడం వల్ల పని నిలిచిపోయింది. ఈ పరిస్థితి కనీసం 15రోజుల నుండి నెలరోజుల వరకు కొనసాగుతుంది. చేనేత వృత్తి కోల్పోయి నేతను ఏ రోజుకు ఆ రోజు చేనేత వృత్తి చేసుకుంటూ జీవనోసాగించుకునే పేదలు, చేనేత వృత్తి కోల్పోయి అప్పులతో ఆకలి చావులతో ఆత్మహత్యలకు బలైపోతున్నారు.అలాంటి చేనేతలను ఈ కష్టకాలంలో ప్రభుత్వాలు ఆదుకొని తీరాలి. ఆ దృక్పథంతోనే రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. సముద్రంలోనికి వేటకు వెళ్ళలేని సమయంలో మృత్యుకారులకు కూడా జీవన భ్రతికింద 20వేల రూపాయలు ప్రభుత్వం అందజేస్తుంది. కనుక తుఫాను బాధిత చేనేత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి పదివేల రూపాయలు చెల్లించాలని కోరుచున్నాము. ఈవిధమైన విధానాలు గత ప్రభుత్వాలు ఇప్పటికే అమలు జరిపాయి. కనుక కనీసం 10వేల రూపాయలు పైగా పెంచి చెల్లించాలని చేనేత కుటుంబాలు కోరుకుంటున్నాయి. అదే సమయంలో ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం నాడు ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి ప్రకటించిన ఉచిత విద్యుత్ వెంటనే అమలు జరపాలి, మంత్రిమండల్లో తీర్మానించిన నేతన్న నేస్తం పథకం 25వేల రూపాయలు కూడా అమలు జరపాలి, సహకార సంఘాలకు ఆప్కో నుండి రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు బుధవరపు బాలాజీ ప్రభుత్వాన్ని ఐక్య కార్యాచరణ కమిటీ ద్వారా తెలుపుతున్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ సంచాలకులు బాలసుబ్రమణ్యం, చేనేత ఐక కార్యాచరణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం రాజశేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సోమాగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు జానపాటి రామసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐకా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఇనుకోటి వెంకట రమణయ్య, చేనేత కుటుంబాలు మహిళలు పాల్గొన్నారు.

# అతి కష్టం మీద బోట్లను గట్టుకు చేర్చిన అధికారులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచనలతో తీవ్రంగా శ్రమించి ఆపరేషన్‌ను అధికారులు విజయవంతం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గత ఐదు రోజులుగా కురిసిన అధిక వర్షాలకు సంగం బ్యారేజ్ సమీపంలో నిలిపి ఉన్న మూడు బోట్లు వాటి తాళ్లు తెగిపోయి పెన్నా నది బ్యారేజ్ వైపుకు కొట్టుకుపోయాయి. అలా నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన మూడు బోట్లు బ్యారేజ్ సమీపంలో ఆనకట్ట వద్ద నిలిచిపోవడం జరిగింది. అవి అక్కడినుండి బ్యారేజ్ వైపుకు వెళ్ళితే బ్యారేజ్‌కు ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉందని వీటిని తొలగించమని స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వెజండ్ల ఇక్కడికి చేరుకొని బోట్లను పరిశీలించి వెంటనే ఇక్కడి నుండి వీటిని తొలగించమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో బుధవారం సాయంత్రం నుండి వీటిని తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి ఒక బోటును ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను డివిజన్ పరిధిలోని ఫైర్ మరియు ఇతర సహాయక బృందాలను ఇక్కడికి తరలించారు. ఆత్మకూరు ఆర్డీవో బి.పావని, డీఎస్పీ కె.వేణుగోపాల్, సోమశిల జలాశయ చైర్మన్ కేశవ చౌదరి స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు రాత్రి నుండి ఈ బోటును తొలగించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి గురువారం ఉదయం 11 గంటలకు అతి కష్టం మీద ఇరుక్కున్న ప్రాంతం నుంచి బోటును బయటికి తీసీ సురక్షిత ప్రాంతానికి తరలించారు. అధికారులు మాట్లాడుతూ.. మరో సారి ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని అన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ సూచనలతో డివిజన్ పరిధిలోని డీఎస్పీ సీఐలు ఎస్ఐలు పూర్తి పోలీస్ సిబ్బంది, ఫైర్, రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది తీవ్రంగా శ్రమించి ఈ ఆపరేషన్ సక్సెస్ చేయడంపై వీరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆర్డిఓ అన్నారు. బ్యారేజ్‌కు ఇబ్బంది కలగకుండా ఈ బోట్లను బయటికి తీయడంపై స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకొని అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

# గోళ్ల రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన బొల్లినేని, మేకపాటి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు వద్ద ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గోళ్లవారిపల్లెలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యేలైన బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గురువారం గోళ్లవారిపల్లె గ్రామానికి చేరుకున్న బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి ప్రమాదంలో మృతి చెందిన గోళ్ల రమేష్, ఆయన తండ్రి గోళ్ల మాలకొండయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామారావు మాట్లాడుతూ.. 'ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. కష్టార్జితంతో ఎదిగిన రమేష్ కుటుంబం ఇలాంటి విషాదాన్ని ఎదుర్కోవడం హృదయ విదారకం.' అని అన్నారు. రమేష్ భార్య అనూష, పిల్లలు శశాంత్, మన్విత్‌ను కోల్పోవడం వంటి విషాదం మరెవరి జీవితంలోకి రాకూడదని ఆకాంక్షించారు. బాధలో ఉన్న మాలకొండయ్య కుమార్తె ధనమ్మ పరిస్థితిని ప్రస్తావిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి బొల్లినేని వెంకట రామారావు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమాలు ఆయన వెంట స్థానిక నాయకులు గ్రామస్తులు ఉన్నారు.



# మూలస్థానేశ్వరుని దర్శించుకున్న వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారిని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దర్శించుకున్నారు.వారిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.కోటి సోమవారం సందర్భముగా వారు ఆలయం లో కోటి దీపం వెలిగించారు.వారి వెంట డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు అని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

## విద్యార్థులకు భారత రాజ్యాంగ పోటీలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు భారతరాజ్యాంపై మండలస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని జడ్పీ ఉన్నత, ప్రభుత్వ, గండిపాళెం గురుకుల పాఠశాలల్లో పాఠశాలల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండలస్థాయి పోటీలకు తీసుకురావాలని ఆయన సూచించారు.

## 21 అడుగులకు చేరిన జలాశయ నీటిమట్టం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయ నీటిమట్టం 21 అడుగులకు చేరిం దని జలనవరుల శాఖ డీఈ కందుకూరి చంద్రమౌళి గురువారం తెలిపారు. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం 21 అడుగులకు చేరిందన్నారు. జలాశయం పైతట్టు ప్రాంతంలో పిల్లాపేరు, దున్నపోత ల వాగుల తోపాటు పలు చెరువులు అలుగులు పారుతుండడంతో జలాశయంలోకి 800 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుందన్నారు. దీంతో నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు.

## నేడు రక్తదాన శిబిరం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జాతీయ పోలీస్ సంస్మరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్టేషన్ ఆవరణలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉదయగిరి సీఐ ఎన్. వెంకటరావు గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనవిలేఖరులతోమాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, కావలి డీఎస్పీ శ్రీధర్ల ఆధ్వర్యంలో జరిగే ఈ రక్తదాన శిబిరాన్ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బంది సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో రక్తదాతలు, నాయకులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పారిశుధ్య చర్యలు చేపట్టిన కౌన్సిలర్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని 7 వార్డు కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్ బేగం ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. అల్ప పీడనం, తుఫాన్ కారణంగా ఇటీవల కాలంలో పది రోజుల నుండి భారీ వర్షాలు పడడం వల్ల వార్డులోని కాలవలన్నింటికీ బ్లీచింగ్ చెల్లించి పలు సూచనలు పారుశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ వర్షాల ప్రభావంతో ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండేలా ప్రజారోగ్యం దృష్ట్యా నౌషాద్ బేగం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆమె దగ్గరుండి బ్లీచింగ్ చల్లించారు. వార్డ్ ప్రజలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

## తుఫాన్ బాదధితులకు సరుకులు పంపిణీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తుఫాన్ బాదిత ప్రజలకు గురువారం అధికారులు, నాయకులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అల్ప పీడనం, తుఫాన్ ప్రభావంతో వారం రోజులుగా భారీ వర్షాలు కురవడం తో జనాలు ఇళ్ళకే పరిమితమయ్యారు. దాంతో తుఫాన్ బాధితులు, మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు సరఫరా చేయగా వాటిని కమీషనర్ గంగా ప్రసాద్, పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి 25కేజీల బియ్యం, ఒక లీటర్ నూనె, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ ఉల్లిపాయలు, ఒక కేజీ బంగాళాదుంపలు, ఒక కేజీ చక్కెర వంతున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శివకోటా రెడ్డి, జిల్లా తెలుగు యువత నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 3237 ఎకరాల్లో పంట నష్టం : జిల్లా వ్యవసాయాధికారిణి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు, మొంథో తుఫాన్ ప్రభావంతో 1295హెక్టార్లలో (3237ఎకరాలు) వరి పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి పేర్కొన్నారు. ఆమె బుధవారం ఆత్మకూరులోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. వర్షాలు, తుఫాన్ కారణంగా ఈనెల 22వ తేదీ నుండి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. దాంతో జిల్లాలోని ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, వరికుంటపాడు, కలిగిరి, గుడ్లూరు, కందుకూరు తదితర 14మండలాల్లో పంట దెబ్బతిన్నదని ఆమె వివరించారు. అనంతసాగరం మండలంలోనే 539మంది రైతులకు చెందిన 1500నుండి 2వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగి దెబ్బతిన్నదని ఆమె పేర్కొన్నారు. ప్రాథమికంగా పంట నష్టాన్ని అంచనా వేసామన్నారు. 5రోజుల్లో పూర్తి పంట నష్టం నివేదిక రైతు పేరు, విస్తీర్ణం, బ్యాంకు ఖాతా నెంబర్లతో ఇవ్వాలసిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారని, ఈ మేరకు తమ శాఖ, రెవిన్యూ శాఖల ఆధ్వర్యంలో నమోదు చేస్తామని, పంట నష్టపోయిన రైతులు వివరాలు ఇవ్వాలని సత్యవాణి కోరారు. నష్టపరిహారంలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామని ఆమె తెలిపారు. ప్రభుత్వ, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో 2వేల కన్నా అధికంగా మొక్కజొన్న, జొన్న పంటల సాగుకు ప్రోత్సాహిస్తున్నామని ఆమె తెలిపారు. ఆసక్తి కల రైతులు తమ శాఖా అధికారులను సంప్రతించాలని ఆమె సూచించారు. సోమశిల



ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉన్నాయని, రానున్న సీజన్‌లో దాదాపు 4లక్షల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు సేవాకేంద్రాలు, సొసైటీలు ద్వారా, ప్రైవేట్ డీలర్ల ద్వారా యూరియా సరఫరా చేయిస్తామన్నారు. ఎకరాకు 3బస్తాల సరఫరా కార్డు విధానం అమలుచేస్తున్నామని ఆమె తెలిపారు. 11వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 10వేల టన్నుల యూరియా జిల్లాలో సిద్ధంగా ఉందని సత్యవాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏలు శేషగిరి రావు, నర్సోజీ రావు, లాబ్ ఏవో పి.చంద్రభాను, స్థానిక మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన

## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణకు విశేష స్పందన లభిస్తోందని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలంలోని బిరదవోలులో గురువారం సాయంత్రం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం పేదలకు వైద్యంతో పాటు వైద్య విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలనుఆలోచన ప్రైవేటీకరించాలనే ఆలోచన దుర్మార్గమన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గం నుంచి 60 నుంచి 70వేల చొప్పున సంతకాలు సేకరించి రాజ్యాంగ అధిపతి అయిన గవర్నర్‌కు అందజేయడం జరుగుతుందన్నారు. ఎలక్షన్‌కు ముందు ఎన్నికల ప్రచారంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పేరుతో కూటమి నాయకులు బాండ్ పేపర్లను ప్రజలకు అందజేసి ఎన్నికల తర్వాత హామీలు అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. తుఫాన్ బాధితులకు అందరికీ నిత్యవసరాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కొందరికేనని మోసం చేస్తున్నారని ఆరోపించారు. పిల్లలు నీళ్ల చేరిన వారికి ఆర్థిక సాయం కూడా అందించడం లేదన్నారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన పోరాటం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిరదవోలు ఎంపీటీసీ సభ్యులు రావుల దశరథ రామయ్య గౌడ్, సర్వేపల్లి వైసీపీ ఐటి వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన గౌడ్, వైసీపీ నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, కోణం బ్రహ్మయ్య, గోగిరెడ్డి గోపాల్ రెడ్డి, వెన్నపూస దయాకర్ రెడ్డి, చల్లా లక్ష్మయ్య, బదుగు శ్రీనివాసులు, కేతబోయిన వెంకటరావు, వాకాటి శ్రీనివాసులు రెడ్డి, దాదిబత్తిన విజయభాస్కర్ రెడ్డి, షేక్ అంజాద్, డాక్టర్ నీలి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# 9వ డివిజన్‌లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 9వ డివిజన్ అంబేద్కర్ నగర్ ప్రాంతంలో గురువారం పర్యటించారు. స్థానికంగా తాగునీటి సరఫరా, రోడ్లు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య నిర్వహణ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు కమిషనర్ ను విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ నగర్ ప్రాంతంలో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కువ్వారపు బాలాజీ,నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 12మందికి గృహాలు కేటాయింపు : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు టిడ్కో గృహాల కేటాయింపు జరిగినప్పటికీ నిర్మాణాలు పూర్తికాని సందర్భంగా కమిషనర్ వై.ఓ. నందన్ ఆదేశాల మేరకు నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధాప్య దశలో ఉన్న 12 మందికి తాత్కాలిక ప్రాతిపదికన గృహాలను కేటాయిస్తూ కమిషనర్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు అర్హులైన లబ్ధిదారులకు కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో 12 మందికి తాత్కాలిక నివాస ఉత్తర్వులను కమిషనర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం సూపరింటెండెంట్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

# సివిల్ సప్లై గోడౌన్ తనిఖీ : ఆర్‌డీఓ అనూష



**కోవూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు మండలం ఇనమడుగులో వున్న సివిల్ సప్లై గోడౌన్‌ను నెల్లూరు ఆర్‌డీఓ అనూష తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సరుకులను తనిఖీలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బియ్యం, చక్కర, కందిపప్పు, యరగడ్డల నాణ్యతను పరిశీలించి తదుపరి డిప్యూటీ తహసీల్దార్ బషీర్, సివిల్ సప్లై డీటీ బాలకోటమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తుఫాను ప్రభావంతో సర్వం కోల్పోయిన ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునే క్రమంలో ఈ నిత్యవసర సరుకులను అందజేయడం జరిగిందన్నారు. సరుకులను సంబంధిత రేషన్ షాపులు వద్ద బాధ్యతలకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం శక్తి వంచన లేకుండా కష్టసమయాల్లో ప్రజలకు అండగా నిలిచి అన్ని విధాల ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారని తెలిపారు.

# గిరిజనులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి గిరిజన కాలనీ వాసులకు తహసీల్దారు ఎల్.రామ్మోహన్, టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొందా తుఫాన్ కారణంగా కాలనీ వాసులు ఏలాంటి ఇబ్బందులు పడకుండా బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన 26 కుటుంబాలకు ప్రభుత్వం సూచన మేరకు బియ్యంతోపాటు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్బాస్ ఖాన్, వీఆర్వోలు మాలకొండయ్య, చెన్నకృష్ణయ్య, సీపీఎం, టీడీపీ నాయకులు కాకు వెం కటయ్య, ఈర్ల శంకర్, వెంకటరమణయ్య, కొండా చినచెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేతినేని వారి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే కాకర్ల



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం వెలగపాడు పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో కేతినేని వారి వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. కేతినేని సాంబశివరావు, సుగుణ దంపతుల కుమార్తె తేజస్వి వివాహ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన గంధపు నలుగు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వధువు తేజస్విని స్వయంగా అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వధువుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆమె జీవితంలో ఆనందం, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు నిండాలని, దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండిపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు, స్నేహితులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# పలువురు అధికారులకు షోకాజు నోటీసులు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం వార్డు అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, పట్టణ ప్రణాళిక విభాగం వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, టీపీబీఓలు, ఏసీపీలకు కమిషనర్ వైఓ నందన్ షోకాజు నోటీసులను గురువారం జారీ చేశారు. స్థానిక 20/1 టైలర్స్ కాలనీ సచివాలయం పరిధిలో హౌస్ టాక్స్ పన్ను విధింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంగా సంబంధిత వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శి ఆర్.నవితాదేవి, పూర్వపు అడ్మిన్ కార్యదర్శి టి.జయమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వై.శ్రీనివాసులకు షోకాజు నోటీసులు జారీ చేశారు. స్థానిక 21/3 మాగుంట లేఔట్ సచివాలయం పరిధిలోని మినీ బైపాస్ ప్రాంతంలో ఏ 1 ఫ్యాషన్ సమీపంలో పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులను ఉల్లంఘించి అదనపు అంతస్తు నిర్మాణం జరుగుతున్నట్లు కమిషనర్ క్షేత్రస్థాయిలో గమనించి విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి కె.కళ్యాణ్, టీపీబీఓ ఎస్.మురళి, ఏసీపీ పి.వేణులకు షోకాజు నోటీసులను జారీ చేశారు. అదేవిధంగా స్థానిక 22/1 మదర్ తెరిసా సచివాలయం పరిధిలోని మినీ బైపాస్ ప్రాంతంలో సిద్ధార్థ కాలేజ్ ఎదురుగా పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేకుండా భవన నిర్మాణం జరగడాన్ని కమిషనర్ క్షేత్రస్థాయిలో గమనించి విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సంబంధిత సచివాలయ వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి పి.కేశవనాథ్, టీపీబీఓ కె.భరత్ కుమార్‌రెడ్డిలకు షోకాజు నోటీసులను జారీ చేశారు. పైన వివరించిన కారణాలపై సంబంధిత వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శులు, టీపీబీఓలు, ఏసీపీ మూడు రోజుల లోపు సంతృప్తికరమైన వివరణతో జవాబు ఇవ్వని పక్షంలో క్రమశిక్షణాత్మక చర్యలు తీసుకుంటామని కమిషనర్ నోటీసు ద్వారా హెచ్చరించారు.

# వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకిస్తూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కోటి సంతకాల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామని మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చింతంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చింతం రెడ్డి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి సూచనలతో సీతారామపురం మండలంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ముమ్మారంగా జరుగుతుందని తెలిపారు. బస్టాండ్ సెంటర్ వద్ద పలు దుకాణాలలో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేస్తున్నారని, దీనిని బట్టి ప్రజల్లో ఈ మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణ పై ఎంత వ్యతిరేకతుందో అర్థం అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకం అదోగతి పాలు అయిందని, కనీసం ఈ మెడికల్ కాలేజీలు అయినా ప్రభుత్వం చేతుల్లో ఉంటే పేదలకు కనీస వైద్యం అందుతుందని, ఈ కళాశాలలు సైతం ప్రైవేటు వ్యక్తుల చేతులకు పోతే ప్రజలు కనీస వైద్యానికి నొచుకోకుండా పోతారని తెలిపారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలని 17 జిల్లాలకు 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని తెలిపారు. వేల కోట్ల రూపాయల ఖర్చుపెట్టి అమరావతిలో



గ్రాఫిక్స్ బిల్డింగులు కట్టే కూటమి నాయకులకు, మెడికల్ కాలేజీలను కట్టే దానికి డబ్బులు లేవడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. అందరూ మెచ్చే రాజధాని అమరావతిలో ఉండడం ఎంత అవసరమో, రాష్ట్రంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రతి రోగికి ఒక ఉచిత వైద్యాన్ని అందించే రాజధాని లాంటి హాస్పటల్ ఉన్నప్పుడే ప్రజలు హర్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు రామిశెట్టి తిరుపతయ్య, మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి మాబయ్య, మండల వైఎస్ఆర్సిపి యువత అధ్యక్షులు చింతం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా యువత నాయకులు మధు కృష్ణంరాజు, మండల వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుపాలు, పలువురు నాయకులు కలసి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముందస్తు జాగ్రత్తలతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చు




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** రొమ్ము క్యాన్సర్ పై అవగాహన మాస కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో మహిళలకు ప్రత్యేకంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రతీ స్త్రీ తన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతీ రోజూ ఒక్క క్షణం సమయం కేటాయిస్తే ఎన్నో ప్రమాదకరమైన వ్యాధుల నుండి బయటపడి ఆనందకరమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జీవీవీ ప్రసాద్ రెడ్డి, ఆంకాలజిస్ట్ డాక్టర్ హరిత, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ సూచించారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా సులభంగా గుర్తించవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. ఈ అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా జరుపుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ప్రధానంగా నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో 'చెక్ -ఓలేట్' (చాక్లెట్ ) పేరుతో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతీ స్త్రీ తన వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతీ రోజూ ఒక్క క్షణం సమయం కేటాయిస్తే వారి జీవితం చాక్లెట్ కంటే తీయగా ఉంటుందన్న అర్థంతో 'చెక్ – ఓలేట్' కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయ గణాంకాల ప్రకారం భారతీయ మహిళల్లో క్యాన్సర్ సంభవం, మరణాలకు రొమ్ము క్యాన్సర్ ప్రధానంగా ఉందని, ప్రతీ ఏడాది క్యాన్సర్ కేసుల్లో పేరుగుతున్నా, స్క్రీనింగ్ టెస్టుల నిర్వహణ విషయంలో భారతదేశం వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే అపోలో హాస్పిటల్స్ సంస్థ క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా మహిళలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని వెల్లడించారు. మహిళలు చిన్న చిన్న స్వీయ పరీక్షల ద్వారా రొమ్ము క్యాన్సర్ లక్షణాలను ముందే గుర్తించవచ్చునని, వెంటనే వైద్యులను సంప్రదిస్తే దాన్ని త్వరగా నివారించే అవకాశం ఉందన్నారు. 40 ఏళ్లు పై బడ్డ ప్రతీ మహిళా నెలకోసారి రొమ్ములకు చిన్న చిన్న స్వీయ పరీక్షలు చేసుకోవాలని, అనుమానం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. స్వీయ పరీక్ష చేసుకోలేని వారు కనీసం ఏడాదికి ఓ సారి రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్ జీవీవీ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ హరిత, డాక్టర్ శ్రీరామ్ సతీష్ మహిళలను కోరారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో రొమ్ము క్యాన్సర్‌కు తక్కువ ఫేజుతోనే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వాయిదా పడ్డ జెడ్పి సర్వసభ్య సమావేశం



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి కోరంలేకపో వడంతో వాయిదా వేయడం జరిగింది. మొత్తం 46 మంది జడ్పిటిసిలు ఉండగా సమావేశానికి మూడవ వంతు 23 మంది జడ్పిటిసిలు హాజరు కావలసి ఉండగా కేవలం ఆరు మంది మాత్రమే జడ్పీటీసీలు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావడంతో పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కోరం లేకపోవడంతో సమావేశాన్ని జడ్పీ చైర్ పర్సన్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తదుపరి సమావేశం సభ్యులతో చర్చించి తెలపడం జరుగుతుందని జెడ్పి చైర్ పర్సన్ అరుణమ్మ తెలిపారు. సమావేశానికి జడ్పీటీసీలతోపాటు మంత్రలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా పడి, వచ్చిన జిల్లా అధికారులు వెళ్లిపోవడం జరిగింది. సమావేశం జరగదని తెలుసుకున్న కొంత మంది జిల్లా అధికారులు సమావేశానికి రాకుండా డుమ్మా కొట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో మోహన్ రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బొల్లినేని



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండల కేంద్రంలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో జరిగిన ఇంగ్లే కొండయ్య, సావిత్రి దంపతుల కుమారుడు క్రాంతికుమార్ వివాహ మహోత్సవం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు హాజరయ్యారు. ఈ వివాహ కార్యక్రమం వైభవంగా జరిగింది, బొల్లినేని వెంకటరామారావు నూతన వధూవరులను మంగళాక్షితలతో ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని కోరుకున్నారు.

## పాఠశాలలను తనిఖీ : ఎంఈఓ వెంకటేశ్వర్లు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి టి.వెంకటేశ్వర్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మాసాయిపేట హరిజనవాడ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల అభ్యసన పఠన సమాజాలను పరిశీలించి తదుపరి విద్యార్థుల యొక్క అసెస్మెంట్ బుక్లెట్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి రాగిజావ తాగారు. రాగిజావలో విద్యార్థుల సంఖ్యను బట్టి తగుపాలలో పిండి, జాగ్రి తోపాటు నాలుగు వేలక్కాయలు వేసిన ఇంకా బాగా రుచిగా ఉంటుందని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు బయటికి వెళ్లకుండా పాఠశాల ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలని ఎందుకంటే తుఫాను ప్రభావంగా చుట్టూ గుంటలు చెరువులు, కాలువలు నిండి ఉన్నందున విద్యార్థులు పాఠశాల కు వచ్చినప్పటి నుండి వదిలి వెళ్ళేంతవరకు ఉపాధ్యాయులు బాధ్యతగా జాగ్రత్తగా చూసుకోవాలని తెలియజేశారు. అలాగే ఉదయగిరి నార్త్ పాఠశాలను ఎంఈఓ 2తోట శ్రీనివాసులు తనిఖీ చేశారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఇంటికి వెళ్లే వరకు ఉపాధ్యాయులు లదే భాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

# పేదలందరికీ నిత్యావసర సరుకులు, ఆర్థికసాయం చేయాలి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** తుఫాను వల్ల పనులు కోల్పోయిన పేదలందరికీ బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం చేయాలి సిపిఎం డిమాండ్ చేసింది. తుఫాన్ బాధితులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌ని కలసి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా సెక్రెటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్లు మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ మండలంలో గత ఐదు రోజులుగా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని పేద ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితి వచ్చిందని, అనేక ఇళ్లలోకి నీళ్లు వచ్చి పనులు కోల్పోయారని ఇంకో 20 రోజులు కూడా పనులు లేని పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కొంతమంది నిరాశ్రయులు కందమూరు, పోట్టే పాలెం గ్రామాలలో ఇప్పటికీ పునరావాస కేంద్రాలలో ఉన్నారని తెలిపారు. వీరందరికీ 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. నారుమ ళ్లు దెబ్బతిన్న రైతులకు ఉచితంగా విత్తనాలు వడ్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకమ్మరాజు, ఎం.పుల్లయ్య, సిపిఎం నెల్లూరు రూరల్ మండలం కమిటీ సభ్యులు అట్లా అనిల్ పాదర్తి మస్తానయ్య పర్చూరు ప్రభాకర్, శ్రీపతి వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీపతి వెంకయ్య, కోటపూడి సుబ్రహ్మణ్యం రాపూర్ రమేష్, బట్ట పెద్దబ్బయ్య, గండవరపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ.. సామాజిక బాధ్యత




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్, వెంగళరావు నగర్ నెల్లూరు నందు భారతీయ స్టేట్ బ్యాంక్ కలెక్టరేట్ శాఖ ఛీఫ్ మేనేజర్ పి.సిహెచ్.హరికృష్ణ, క్యాష్ ఇన్‌చార్జ్ ఎం.శశి కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపెయిన్ 5.0 ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ ఆర్ బీవో కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఎన్సిసి అధికారి గుండాల నరేంద్రబాబు పర్యవేక్షణలో పాఠశాల ఆవరణలో పలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బ్రాంచి చీఫ్ మేనేజర్ హరికృష్ణ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బాల్యం నుంచే విద్యార్థులలో ఒక అవగాహన కలిగించేందుకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పెంచి పెద్ద చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అందుకే పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని నేడు మనం నాటిన మొక్కలే భావి జీవితంలో మహా వృక్షాలుగా ఎదిగి పాఠశాలకు చక్కటి వాతావరణాన్ని మంచి ఆరోగ్యాన్ని అందజేస్తాయని విద్యార్థులు విధిగా ప్రతి ఒక్కరూ వారి వారి ఇళ్ల దగ్గర మొక్కలు నాటి పెంచి పెద్ద చేయాలని నాటిన మొక్కలను ప్రతి ఒక్కరూ కాపాడాలని వృక్షాలను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని చెట్ల యొక్క ఆవశ్యకతను వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి పరామర్శ

## బాధిత కుటుంబానికి బొల్లినేని దాతృత్వం

**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కొండాపురం మార్గంలో తెల్లపాడు క్రాస్ రోడ్డు సమీపంలోని విద్యుత్ ఉపకేంద్రం ఎదుట ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాబు-మమత దంపతులతోపాటు ఒక కుమార్తె దుగ్గి దుర్మరణం పాలయ్యారు. ఒక కుమార్తె తీవ్రంగా గాయపడిన ఈ విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై స్పందించిన మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. వారి కుటుంబానికి పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన



చిన్నారిని చూసి ఆయన చలించి పోయారు ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె వైద్య ఖర్చులకు తన వంతు సాయం అందించామన్నారు. మానవీయతతో ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వరద బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజాతిల దినములో భాగంగా ఇటీవల జిల్లాలోకి వచ్చిన వరదలకు నష్టపోయిన వరద బాధితులును ఆదుకోవాలని బీజేపీ నేతలు మిడతల రమేష్ కందికట్ల రాజేశ్వరిలు సోమవారం నెల్లూరు డిఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు జిల్లాలో వరుస వర్షాలు తుఫాను ప్రభావంతో 3300 ఎకరాలలో కోతకు వచ్చిన పంట నీట మునిగింది. ఎకరాకు 40వేల చొప్పున సుమారు 132 కోట్ల మేర ధాన్యం రైతులు నష్టపోయారు. 1996 చేనేత మగ్గాలలో నీరు చేరడంతో చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయారు. నీటిపారుదల సెంట్రల్ డివిజన్ పరిధిలో 100 కోట్ల మేర చెరువులు కాలువలు రిజర్వాయర్లు దెబ్బతిన్నాయి. కండలేరు జలాశయ పరిధిలోని బ్రాంచ్ కాలువల గండ్లు వలన రెండు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. కండలేరు ఎర్త్ డ్యాం నిర్మించి 30 సంవత్సరాలు దాటినందున మట్టికట్ట పటిష్టత కోసం 50కోట్ల రూపాయలుపైగా వ్యయం చేయాల్సి ఉంది. తుఫాన్ ప్రభావంతో ఇద్దరు మనుషులు గల్లంతయ్యారు. 600 బాతులు చనిపోయాయి. ఆరు గొర్రెలు, తొమ్మిది బర్రెలు మృత్యువాత పడ్డాయి. రోడ్ల మరమ్మత్తుల కోసం 22కోట్ల రూపాయలు అవసరమవుతుంది. సమగ్ర విచారణ జరిపి తుఫాన్ బాధితులును ఆదుకోవాలని రమేష్ రాజేశ్వరమ్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రఘురామయ్య నరాల సుబ్బారెడ్డి, ఏవి సుబ్బయ్య, టి.శ్రీనివాసులు, నారాయణ యాదవ్, రాములు యాదవ్, ఆదినారాయణ, అల్లూరు నాగేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలోని మోంథా తుఫాన్ బాధితులకు గురువారం తహసిల్దార్ శివకృష్ణయ్య చేతుల మీదుగా నిత్యవసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుఫాన్ కారణంగా ఇళ్లలోకి నీళ్లు చేరి పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న మండలంలోని 111 మంది బాధితులకు నిత్యవసరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి, సురాయిపాలెం, విరువూరు, మహమ్మదాపురం, పొదలకూరు, ముదిగేడు గ్రామాల్లోని బాధితులకు నిత్యవసరాలను గ్రామ నాయకులు ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు వివరించారు. ఒక్కో కుటుంబానికి బియ్యం 25 కిలోలు, కందిపప్పు కేజీ, చక్కర కేజీ, పామాయిల్ ఒక లీటరు, బంగాళదుంపల కేజీ, ఆనియన్స్ కేజీ చొప్పున అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలచిరు మస్తాన్ బాబు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తాసిల్దార్ ఇండ్ల రవి, టిడిపి నాయకులు అలుపూరు శ్రీనివాసులు, కండే సురేష్ తదితరులు పాల్గొన్నారు.


## నేడు పదవీ విరమణ చేయనున్న ఎస్.వెంకటేశ్వర్లు



**కావలి, మేజర్‌న్యూస్ :** సుదీర్ఘంగా కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్మెంట్లో 32న సంవత్సరం ఇన్స్పెక్టర్గా పనిచేసి నేడు పదవీ విరమణ కానున్న ఎస్.వెంకటేశ్వర్లు పలువురు అభినందనలు తెలుపుటకు శుక్రవారం కావలి పట్టణం కోపరేటివ్ కాలనీలో ఉన్న సెల్టాక్స్ ఆఫీసు నందు సెల్ టాక్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఈ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించబడుతున్నట్లు సమాచారం. అలాగే 32 సంవత్సరాలు ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందించి ప్రజలు, ఉన్నత అధికారులు మన్ననలు పొందిన వ్యక్తిగా ఎస్.వెంకటేశ్వర్లు అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే తను ఉద్యోగంలో బాధ్యతలు స్వీకరించిన దగ్గర ప్రస్తుతం పదవీ విరమణ వరకు, తనువివిధ హోదాల్లో వివిధ ప్రదేశాల్లో విధులు నిర్వహించిన కాలంలో ఎక్కడ ప్రజల నుండి ఉన్నత అధికారుల నుండి కానీ, మచ్చలేని వ్యక్తిగా ఉండడం విశేషం. వ్యాపారస్తులతోనూ ఉన్నత అధికారులతోనూ స్నేహపూర్వకంగా వ్యవహరించేవారని, ఉన్నతాధికారుల ఆదేశాలను శిరసా వహిస్తూ, అందరి మన్ననలు పొంది ఈ రోజున పదవీ విరమణ కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

# మగ్గం గుంతల్లో వర్షపు నీరు

- అవస్థల్లో చేనేత కార్మికులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఇటీవల కురిసిన మొంథా తుఫాను కారణంగా ఏ ఎస్ పేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చేనేత మగ్గాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో చేనేత కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు మండలంలోని కావలి యడవల్లి గ్రామంలో సుమారు 150 గుంతల మగ్గాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో తీవ్రంగా నష్టపోవడమే కాక పనులు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. మండలంలోని హసనాపురం ఏఎస్పేట చందులూరుపాడు తదితర గ్రామాల్లో ఉన్న చేనేత కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలోని కావలి ఎడవల్లి గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ సుమారు 350 మీటర్ల వరకు దెబ్బతిని ఉన్నది. వర్షం కారణంగా కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల ప్రహరీ గోడ మరమ్మత్తులు చేయవలసిందిగా స్కూల్ పేరెంట్స్ కమిటీ, గ్రామ సర్పంచ్ ముప్పూరు ధనమ్మ, గ్రామ టీడీపీ నాయకులు మాల్యాద్రి నాయుడు కోరుతున్నారు.

# సౌత్‌మోపూర్‌కి విద్యుత్ శాఖ హెల్పర్‌ని నియమించాలి : సీపీఐ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామానికి చెందిన సబ్ స్టేషన్ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామాలతో పాటు మరో నాలుగు గ్రామాలకు విద్యుత్ శాఖ హెల్పర్ లేనందువలన వర్షాలు వచ్చినా సమయంలో కానీ విద్యుత్ పరంగా మరే ఇతర సమస్యలు వచ్చిన తక్షణం సాయం చేసేందుకు హెల్పర్ లేకపోవడంతో ఈ గ్రామాల్లో సౌత్ మోపూర్‌తో పాటు పక్క గ్రామాలలో కూడా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి అన్నారు. గురువారం నాడు సౌత్ మోపూర్ సబ్ స్టేషన్ ఎదుట సిపిఐ మండలం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దాదాపు 1600 కుటుంబాలకు పైగా ఉన్నటువంటి సౌత్ మోపూర్ గ్రామమునకు గత రెండున్నర సంవత్సరాలుగా హెల్పర్ లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన వారు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని తక్షణం ఈ ప్రాంతానికి అవసరమైన హెల్పర్ను నియమించేందుకు అధికారులను ఆదేశించాలని అరిగెల సాయి డిమాండ్ చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ్యులు తక్షణం సౌత్ మోపూర్ స్టేషన్‌కు హెల్పర్ ఏర్పాటు చేయని పక్షంలో ఈరోజు నుంచి 30 రోజులలోపుగా ఏర్పాటు చేయాలని కాని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ నెల్లూరు రూరల్ మండలం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి హెచ్చరించారు. సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరథ రామయ్య మాట్లాడుతూ.. ఈ ప్రాంతానికి విద్యుత్ సబ్ స్టేషననిర్మించేందుకు పది లక్షల రూపాయలు ఖర్చు చేసి ఒక కిలోమీటర్ నుంచి పైప్ లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరిగిందని, అదేవిధంగా వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి కొండపైన ప్రత్యేకంగా రెండు గాలి మరలను ఏర్పాటు చేసి తద్వారా విద్యుత్ తీసుకునేందుకు గ్రామస్తులంతా దాదాపు పది లక్షల రూపాయలు మేరకు ఆరోజు నిధులు అందించారని, అయితే ప్రభుత్వం ఈరోజు హెల్పర్ను ఏర్పాటు చేయడంలో చూపుతున్న నిర్లక్ష్యం ఏమిటో అర్థం కావడం లేదు. గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు వీధిలైట్లన్నీ పాడైపోయినాయని అసలే వర్షాలకు వర్షపు నీళ్లతో వీధుల్లో పురుగు పుట్రాతో పిల్లలు, పెద్దలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపైన విద్యుత్ అధికారులు తక్షణం స్పందించి గ్రామానికి హెల్పర్ను ఏర్పాటు చేయాలని అదేవిధంగాగ్రామంలోవర్షాలకు దెబ్బతిన్న వీధి దీపాలన్నీ తక్షణం మరమ్మతులు చేయాలని దశరథరామయ్య ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ రూరల్ మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ మాట్లాడుతూ.. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ సమస్యపై తక్షణం స్పందిస్తానని మీకు తగిన సాయం చేస్తానని హామీ ఇచ్చారు, ఆతరువాత ఆయన పార్టీ మారడం తిరిగి ఎమ్మెల్యే అయినా గాని ఈ రోజు వరకు మాసమస్యనుపరిష్కరించలేదని హెల్పర్ను నియమించడం ప్రభుత్వం పని అని తన పరిధిలో లేదని ఒక ఎమ్మెల్యే చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఆదినారాయణ ఎద్దేవా చేశారు. ఏది ఏమైనా ఒక్క నెల రోజుల లోపుగా ఈ ప్రాంతంలో హెల్పర్ అని నియమించకపోతే భారత కమ్యూనిస్టు పార్టీఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టేందుకు సిద్ధం కావాలని జిల్లా కార్యదర్శి ఇప్పటికే పిలుపునిచ్చారని కనుక శాసనసభ్యులు విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించి ఈ ప్రాంతానికి హెల్పర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నంది పోగు రమణయ్య




మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టకు ముందు చెప్పే మాటలకు తర్వాతే మాటలకు పొంతన ఉండదని గతంలో కూడా ఎన్నోసార్లు హామీల ప్రకటించారు. తప్ప పేద ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విస్మరించారని కనుక ఇప్పటికైనా ప్రభుత్వ పరంగా పేద ప్రజలకు అవసరమైన పనులను తక్షణం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని రమణయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి మాలకొండయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పముజల హరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిల్లాలి ఖాన్, వ్యవ సాయ కార్మిక సంఘంజిల్లాఅధ్యక్షులు లీలామోహన్, సౌత్ మోపూర్ గ్రామ ఉపసర్పంచ్ చల్ల నరసయ్య, ప్రజానాట్యమనలి తల్లు సీనయ్య, సౌత్ మోపూర్, గ్రామ కార్యదర్శి, రాజగోపాల్, నాగరత్నం, బాలయ్య, స్థానిక సిపిఐ కార్యకర్తలు పలువురు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సబ్ స్టేషన్ పరిధిలోని అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

## ఆర్టీవో దాడులు ప్రైవేట్ ట్రావెలర్ బస్సు సీజ్



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలులో ఇటీవల జరిగిన బస్సు అగ్నిప్రమాదంను దృష్టిలో ఉంచుకొని ఆర్టీవో అధికారులు అప్రమత్తమయ్యారు అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే వింజమూరులో గురువారం పి.మురళి ధర్ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సుందర్ రావు కరుణాకర్ లక్ష్మీబాయిలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఫైర్ ఎగ్జిస్టింగ్‌కు సంబంధించి పరికరాలు లేకపోవడంతో ఒక బస్సును సీజ్ చేసినట్లు ఆర్టీవో తెలిపారు. అదేవిధంగా అన్ని ప్రైవేట్ బస్సులను తనిఖీ చేసే నిబంధనలు అతిక్రమించినట్లయితే చీజ్ చేస్తామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబానికి గడ్డం పకిరయ్య దాతృత్వం



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి నుండి దుబాగుంట గ్రామానికి వెళ్తూ తెల్లపాడు క్రాస్ రోడ్డు సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాబు-మమత దంపతులతో పాటు ఒక కుమార్తె దుగ్గి దుర్మరణం పాలయ్యారు. ఒక కుమార్తె తీవ్రంగా గాయపడిన ఈ విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై స్పందించిన విలేకర్ గడ్డం పకిరయ్య, తోటి విలేకర్లు బాధిత కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. వారి కుటుంబానికి రూ. 25,000 ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని పకిరయ్య పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడిన చిన్నారిని చూసి ఆయన చలించి పోయారు. ఆమెకు 3 సంవత్సరాలు పాటు స్కూల్ చదువులకు అయ్యే ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు రవీంద్ర రెడ్డి, ఎన్టీవీమాధవ, రాము, ఇర్మీయా తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో పర్యటించిన : సీపీఐ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలో మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, సహాయ కార్యదర్శి నంది పోగు రమణయ్య జిల్లాకార్యవర్గసభ్యులు పి.మాలకొండయ్య రూరల్ మండలం సహాయ కార్యదర్శి ఆదినారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు లీలా మోహన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జిలాని ఖాన్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి విజయకుమార్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పముజుల హరి రూరల్ మండలం సిపిఐ సీనియర్ నాయకులు చల్లా నరసయ్య తదితరులు రూరల్ మండలంలోని తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాలను పర్యటించారు. అందులో భాగంగా ములుమూడి కలుజు వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లూరు నుంచి పలు గ్రామాలకు వెళ్లే ఈ ప్రాంతాలు ఈ కలుజు వలన వర్షాలు వస్తే పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిపై పలుసార్లు సిపిఐ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేయడం జరిగిందని అయినా ప్రభుత్వం మాటలకు మాత్రం చేస్తామని చెప్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదని అరిగేల సాయి ఆరోపించారు. పాలకులు చేస్తామని చెప్తున్నారు తప్ప మాటలకే పరిమితం అవుతూ అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఈ ఈ ప్రాంత ప్రజలు నన్ను ఎంతో ఆదరించి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని తప్పక ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను తీర్చేందుకు చర్యలు



బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామని మాటలు చెప్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం ఏమీ జరగలేదని ఇటీవల మెంతు తుఫాన్ తుఫాను వర్షాల వల్ల ఈ ప్రాంతంలోని ప్రజలు బయటకు వెళ్లేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అదేవిధంగా ఈ ప్రాంతంలోని ప్రజలు నెల్లూరుకు అవసరమైన వైద్య సహాయం కోసం కానీ మరి ఇతర పనుల కోసం కానీ రావాలంటే ఇదే ప్రధానం మార్గమని ఈ మార్గంలో వర్షం వచ్చిన పడే ఇబ్బందులు చూస్తుంటే దీనిపైన వెంటనే ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి ఈ ప్రాంతానికి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి కోరారు. అలా కాని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆయన సౌత్ మోపూర్ గ్రామంలోని చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారు పడుతున్న ఇబ్బందులను మగ్గాల గుంటలలో నీళ్లు రావడంతో పనులు లేక అవస్థలు పడుతున్నారని మరో 20 రోజుల వరకు వారు పని చేసుకునే పరిస్థితి లేదని కనుక రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సాయంగా చేనేత కార్మికులకు 20వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని 25 కేజీల బియ్యాన్ని నిత్యవసర సరుకులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ మండలంలో గత ఐదు రోజులుగా మొంథా తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని పేద ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితి వచ్చిందని, అనేక ఇళ్లలోకి నీళ్లు వచ్చి పనులు కోల్పోయారని ఇంకో 20 రోజులు కూడా పనులు లేని పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కొంతమంది నిరాశ్రయులు కందమూరు,పోట్టేపాలెం గ్రామాలలో ఇప్పటికీ పునరావాస కేంద్రాలలో ఉన్నారని తెలిపారు. వీరందరికీ 25 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. నారుమళ్లు దెబ్బతిన్న రైతులకు ఉచితంగా విత్తనాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు తదితర గ్రామాలలో నుంచి పలువురు మహిళలు రైతులు చేనేత కార్మికులు సిపిఐ బృందానికి తమ సమస్యలు తెలియజేశారు.

# 3వ డివిజన్‌లో వైసీపీ కోటి సంతకాల సేకరణ





**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 3వ డివిజన్ కిసాన్ నగర్‌లో గురువారం వైసీపీ ఆధ్వర్యంలో కోటిసంతకాల ఉద్యమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదట పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రచ్చబండ కార్యక్రమం నిర్వహించి, డివిజన్ స్థాయి కమిటీలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే దిశగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకునే దిశగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి స్థానిక ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కోటి సంతకాల సేకరణ పత్రులపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ఏకంగా 17నూతన మెడికల్ కళాశాలను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా.. చంద్రబాబు మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం దుర్మార్గమని మండిపడ్డారు. మెడికల్ కళాశాలలను తమ పార్టీ నేతలకు అప్పనంగా దోచి పెట్టేందుకే చంద్రబాబు నాయుడు ఇలాంటి అనాలోచిత నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల ఉద్యమం చేపడుతున్నామని అన్నారు. అందులో భాగంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో 3వ డివిజన్ కిసాన్ నగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నడం చూస్తుంటే.. ఈ సంతకాలు.. నెల్లూరు నగర నియోజకవర్గంలో 60వేలు కాదు లక్ష దాటే అవకాశం కనిపిస్తుందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసి.. కూటమి ప్రభుత్వానికి ప్రజా ఆకాంక్షను బలంగా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వరరెడ్డి, 5, 11వ డివిజన్ ఇన్‌చార్జ్‌లు సుబ్బారెడ్డి, మహేష్ యాదవ్, వైసీపీ నేతలు రామచంద్రయ్య, హరిబాబు, అభిషేక్ రెడ్డి, ధనుంజయ, మల్లి ఖార్జున, రాజ్ కుమార్, సుజాతమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాలేపాటి ఉత్తర క్రియల్లో ఎమ్మెల్యే కావ్యకు చేదు అనుభవం

# గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు



**కావలి, మేజర్‌న్యూస్ :** దగదర్తి మండలంలో ఇటీవల అరాస్ట్రా గ్రూప్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, దగదర్తి మండల యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు మృతి చెందారు. ఈ విషయాన్ని అందరికీ తెలిసిందే. అయితే కావలి నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిస్థితులే వీరి మృతికి కారణమని ప్రజల్లో మాలేపేట అభిమానుల్లో ఒక అవగాహన ఉంది. అయితే వారు చనిపోయి నప్పుడు కావలి ఎమ్మెల్యే పరామర్శకు కూడా రాకపోవడం విశేషం. అయితే పార్టీ అధిష్టానం మేరకు ఉత్తరక్రియలకు ఎల్లాలని తెలిపిన మీదట లేక మరి ఏ విషయం గురువారం అక్కడ జరుగుతున్న ఉత్తర క్రియలకు హాజరవుటు కు వెళ్లడంతో అక్కడ మాలేపాటి అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయ కులు కావ్యపై ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అడ్డు కున్నప్పటికీ కూడా అక్కడ వారిని కారును దిగనీయకుండా గో బ్యాక్ ఎమ్మెల్యే కావ్య అనే నినాదాలతో కారుని చుట్టుముట్టడం తర్వాత పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం, తిరిగి కావలి రావడం జరిగింది.

# రైతుల పక్షపాత ప్రభుత్వం కూటమి ప్రభుత్వం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని సౌత్ మోపూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కొంతమంది యూరియాపై వదంతులు సృష్టిస్తున్నారు. ఆ వదంతులు నమ్మవద్దు. నెల్లూరు రూరల్‌లో రైతులకు పంటకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రతి రైతుకు యూరియా అందించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం నెల్లూరు రూరల్ మండలంలోని పాత వెల్లంటి గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అలాబక్షు, మండల కో ఆప్షన్ మెంబర్ మీరామోహిద్దీన్, గుండ్లపాలెం పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు పముజుల ప్రదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాపూరు శేఖర్, నీటి సంఘం అధ్యక్షుడు తుళ్లూరు రామయ్య, సౌత్ మోపూర్ గ్రామ ఉపసర్పంచ్ చల్లా నరసయ్య, పాత వెల్లంటి గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలో పారిశుధ్యంపై చర్యలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికేఆర్ ఎస్టీ కాలనీ, మొటచింతలపాలెం, బీసీ కాలనీలు నందు పారిశుద్ధ్యం మెరుగుకై చర్యలు చేపట్టారు. ఎంపీడీఓ శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.రామారావు ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభావం వలన కాలనీలు అంతటా పరిశుభ్రత దెబ్బతిన్నట్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాలనీవాసుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అనారోగ్య పరిస్థితి నుంచి కాపాడేందుకు పారిశుధ్య పనులను చేపట్టారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లి దోమల వృద్ధిని అరికట్టే విధంగా చర్యలు చేపట్టారని ఆయన తెలిపారు కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## కావలికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో ఎక్కువ వర్షపాతం కావలి పట్టణంలో నమోదవడం విశేషం అయితే కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న హరిజనులు గిరిజనులు, కొంత భాగం గృహాల్లోకి నీరు చేరడం జరిగింది. ఈ నష్టాలను అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది. ఈ విషయంపై కావలికి జిల్లా న్యాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ అయిన ఎన్ఎండి ఫరూక్ రావడం వారిని సాదరంగా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఆర్డిఓ ఎస్.వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ ముస్లిం నేతలు తదితరులు ఆహ్వానించారు. అనంతరం కావలిలో జరిగిన నష్టాలను జరుగుతున్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించుకున్నారు.

## రుణం పేరుతో మోసపోయిన బాధితుడు




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం కెనరా బ్యాంకులో రుణం కోసం వెళ్లిన ఓ వ్యక్తిని బ్యాంకులో పనిచేసే మహిళా ఉద్యోగి మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. భాస్కర్ రాజు అనే వ్యక్తి తన పశువుల పోషణ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మొదట బ్యాంకు వారు తనకు రుణం రాదని చెప్పడంతో సదరు బాధితుడు ఆ ప్రయత్నాలను విరమించుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత తనకు తెలియకుండా తనపై లక్షా యాబై వేల రూపాయలు రుణం మంజూరు అయినట్లు బ్యాంకు ద్వారా సమాచారం రావడంతో బ్యాంక్‌లో పనిచేసే మహిళా ఉద్యోగి తనకు తెలియకుండా తన పేరుపై రుణం తీసుకున్నట్లు తెలుసుకొని ఆమెను నిలదీశాడు. దీనితో ఉద్యోగిని రుణాన్ని మూడు నెలల్లో చెల్లిస్తానని లిఖితపూర్వకంగా బాధితుడికి నోట్ వ్రాయించి ఇచ్చింది. బాధితుడు తనకు జరిగిన మోసాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

## సుందరేశ్వర స్వామి ఆలయంలో కోటి సోమవారం వేడుక



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి వారి దేవస్థానం నందు గురువారం కోటి సోమవారం సందర్భంగా శ్రీ స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకాలు, పాలాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసముతో ప్రధాన అర్చకులు, వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా అభిషేక కార్యక్రమాలు జరిపినారు. పై కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది. తదుపరి సాయంకాలం అధిక సంఖ్యలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి రాత్రి 7:30 నిమిషాలు శ్రీ స్వామివారికి కుంభ హారతులను తిలకించడం జరిగింది. పై కార్యక్రమం సహాయ కమీషనరు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కోవూరు జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.

## వైయస్ జగన్‌ను కలిసిన బీసీ నాయకులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ వైసిపి బీసీ నాయకులు, విష్ణువర్ధన్ రెడ్డి అభిమాని అనుచరుడైన కే.మోహన్‌రావు విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిశారు. విష్ణువర్ధన్ రెడ్డి బీసీ నాయకుడు అని పరిచయం చేయడం జరిగింది. అనంతరం ఆప్యాయంగా పలకరించి అనంతరం విష్ణువర్ధన్ రెడ్డితో కావలి రాజకీయ పరిస్థితుల గురించి కొంతసేపు చర్చించుకోవడం జరిగింది.